ప్రజాశక్తి
ఆదివారం 12 ఫిబ్రవరి 2023 5
శ్రీ సత్యసాయి





బెస్టు యూనివర్సిటీ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు



ద్విచక్రవాహన... ప్రమాదాలే అధికం..!

మృతుల్లో వాహనం నడుపుతున్న వారే ఎక్కువ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రమాదాలకు గురై మృతి చెందుతున్న వారిలో అత్యధికంగా ద్విచక్ర వాహనదారులే ఉన్నారు. ఆ తరువాత ట్రక్కు డ్రైవర్లు ఉంటున్నారు. ఈ ఏడాది నుంచి ప్రభుత్వం ఐఆర్ఎడి (ఇంటిగ్రేటెడ్ రోడ్డు యాక్సిడెంట్ డేటా బేస్)ను రూపొందించింది. దీని ప్రకారం ఎక్కడైనా ప్రమాదం చోటు చేసుకుంటే అటు రవాణా, ఇటు పోలీసు, జాతీయ రహదారి, వైద్య శాఖ అధికారులు అందరూ సంయుక్తంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన డేటా బేస్‌లోకి సమాచారాన్ని, తమ పరిశీలనను అందులో పొందుపరచాలని నిర్ధేశించింది. అది కూడా వాహనం యొక్క పూర్తి వివరాలతో ఈ డేటా బేస్‌ను రూపొందిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈరకంగా అన్ని శాఖలు కలిపి రూపొందిస్తున్నాయి. దీని ప్రకారం జిల్లాలో చూస్తే ప్రమాదాల్లో అత్యధికంగా ద్విచక్ర వాహనాలే ఉంటుండటం గమనార్హం. మృతుల్లోనూ వీరే అధికంగా ఉంటున్నారు. జిల్లాలో వాహనాలు నడుపుతూ చనిపోయిన వారు 237 మంది ఉంటే అందులో ద్విచక్ర వాహనం నడుపుతూ 99 మంది చనిపోయారు. ఆ తరువాత ట్రక్కు, లారీ డ్రైవర్లు 57 మంది ఉన్నారు. జీపు డ్రైవర్లు 29 మంది చనిపోయారు. బస్సు డ్రైవర్లు 15 మంది ఆటో రిక్షా ఆరుగురు డ్రైవర్లు మృతి చెందిన వారిలోనున్నారు. ఈ వాహనాలు అన్నింటిలోనూ ప్రయాణిస్తున్న వారు 167 మంది చనిపోయారు. సహ ప్రయాణికులుగా ఉంటూ చనిపోయిన వారిలోనూ ద్విచక్ర, లారీల్లో ప్రయాణించే వారే ఉండటం గమనార్హం. ద్వికచక్రవాహనంలో డ్రైవింగ్ చేస్తున్న వారితోపాటు 46 మంది చనిపోయారు. ఇక లారీ, ట్రక్కుల్లో చూస్తే 34 మంది ఉన్నారు. కారు ప్రమాదాలుపై వాటితో పోలిస్తే తక్కువగానే ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.

డ్రైవింగ్ లైసెన్సు లేని వారే ఎక్కువ...

రోడ్డు రవాణా శాఖ గతేడాది జనవరి ఒకటి నుంచి డిసెంబర్ ఆఖరు వరకు చూస్తే మొత్తం 9234 మంది నిబంధనలను ఉల్లంఘించి వాహనాలు నడిపిన వారిలోనున్నారు. ఇందులో చూసినప్పుడు అత్యధికంగా డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడిపిన వారే అధికంగా ఉండటం గమనార్హం. 3921 మంది లైసెన్సు లేకుండా వాహనం నడుపుతున్న వారిని గుర్తించి జరిమానాలు విధించారు. ఆ తరువాత అత్యధిక వేగంగా నడుపుతున్న వారికి జరిమానాలు విధించారు. 2404 మంది అత్యధిక వేగంగా నడుపుతున్న వారిని గుర్తించి జరిమానాలు విధించారు. 1384 కేసులు ఓవర్ లోడింగ్‌తో వెలుతున్న వాటికి జరిమానాలు విధించారు.

రోజుకు సగటున ఒకరు మృతి

జిల్లాలో రోడ్డు ప్రమాదాల సంఖ్యను చూసినప్పుడు రోజుకు ఒకరు చొప్పున సగటున మృత్యువాత పడుతున్నారు. 2022 సంవత్సరంలో చూసినప్పుడు 321 మంది మృతి చెందారు. దాదాపు ఒకరు చొప్పున మృతి చెందుతన్నారు. ఈ మృతుల్లో ద్విచక్ర వాహనదారులే అధికంగా ఉన్నట్టు ఐఆర్ఎడి నివేదికలు చెబుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో గడిచిన రెండు రోజులుగానూ వరుసగా ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. కనగానపల్లి వద్ద జరిగిన కారు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. అమరాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న ఇద్దరు మృతి చెందారు. ఇలా రోజూ ఏదోక చోట రోడ్డు ప్రమదాల్లో ప్రాణాళు కోల్పోతూనే ఉన్నారు.



అమరాపురం యంజేరు చెరువు వద్ద ప్రమాదంలో మృతి చెందిన యువకులు

అమరాపురం : టిప్పర్, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన శ్రీ సత్యసాయి జిల్లా అమరాపురం మండలం

టిప్పర్-ద్విచక్రవాహనం ఢీ ఇద్దరు మృతి

హేమావతి యంజేరు చెరువు మలుపు వద్ద శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... అమరాపురం మండలం హనుమంతనపల్లి గ్రామానికి చెందిన ఈరన్న కుమారుడు అనిల్ కుమార్(25), కర్ణాటక రాష్ట్రం హులికుంట గ్రామానికి చెందిన శ్రీధర్(24)లు హులికుంట నుంచి ద్విచక్రవామనంలో హనుమంతనపల్లికి బయలుదేరారు. ద్విచక్ర వాహనం హేమావతి యంజేరు చెరువు మలుపు వద్దకు రాగానే పావగడ నుంచి కర్నాటక రాష్ట్రం దొడ్డబానగెరెకు వెళ్తున్న టిప్పర్ ఢీకొంది. టిప్పర్ చక్రాలు యువకుల మీద వెళ్లడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాద వివరాలను స్థానికులతో అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఫీజుల కోసం వేధింపులు దుర్మార్గం

బెస్టు యూనివర్సిటీపై చర్యలు తీసుకోండి
కళాశాల ఎదుట విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి-గోరంట్ల టౌన్

ఫీజుల పేరుతో వేధింపులకు గురి చేస్తున్న గోరంట్ల మండలం కమ్మలవాండ్లపల్లి వద్ద ఉన్న బెస్టు యూనివర్సిటీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఉదయం యూనివర్సిటీ ప్రధాన ద్వారం ముందు బైఠాయించి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ యూనివర్సిటీలో అగ్రికల్చర్ చదువుతున్న విద్యార్థులు ఫీజులు కట్టలేదన్న సాకుతో సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు అనుమతి ఇవ్వడం లేదన్నారు. పరీక్ష రాయాలంటే పరీక్ష ఫీజు ఒక్కో సబ్జెక్టుకు అదనంగా రూ.వెయ్యి కట్టాలనే నిబంధన పెట్టారన్నారు. 9 సబ్జెక్టులకు అదనంగా రూ.9వేలు కట్టి పరీక్షలు రాయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ నేపథ్యంలోనే ఫీజు ఒత్తిడి తాళలేక శుక్రవారం నాడు యూనివర్సిటీకి చెందిన ఓ విద్యార్థి ఆత్మహత్యకు యత్నించాడని చెప్పారు. అధ్యాపకులు, యాజమాన్యం విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యకం చేశారు. సర్టిఫికెట్లు ఇవ్వమని అడిగినా పట్టించుకోవడం లేదన్నారు. హాస్టల్లో భోజన వసతి, మౌలిక వసతులు కూడా సరిగా లేవన్నారు. అధిక ఫీజులు ఎందుకోసం వసూలు చేస్తున్నారని ప్రశ్నించిన విద్యార్థులను యూనివర్సిటీ నుంచి సస్పెండ్ చేస్తామంటూ బెదిరింపులకు గురి చేస్తున్నారని చెప్పారు. పరీక్షలు ప్రతి సమయంలోనూ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీ డిప్యూటీ వైస్ ఛాన్సలర్ చిత్రాయిసెల్వం విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా, నిరంకుశగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికొచ్చి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి సమస్యను పోలీసులకు తెలిపారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ సుబ్రహ్మణ్యం విద్యార్థుల వద్దకొచ్చి సమస్యలను విన్నారు. యాజమాన్యంతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

ఫీజుల కోసం వేధిస్తే ఉద్యమిస్తాం
ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి

హిందూపురం : విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతూ ఫీజుల కోసం వేధింపులకు పాల్పడుతున్న గోరంట్ల మండలంలో ఉన్న బెస్టు యూనివర్సిటీ సిబ్బంది తీరులో మార్పు రాకుంటే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గోరంట్లలో ఉన్న బెస్ట్ యూనివర్సిటీలో అధిక ఫీజుల పేరుతో విద్యార్థులను వేధిస్తున్నారని చెప్పారు. ఈ ఫీజులు వేధింపులు తాళలేక నాలుగవ సంవత్సరం చదువుతున్న మనోహర్ అనే విద్యార్థి శుక్రవారం నాడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం యూనివర్సిటీ నిర్వాహణ లేదన్నారు. గతంలో కూడా ఇదేవిధంగా విద్యార్థులను యూనివర్సిటీ ఫీజులు పేరిట వేధించారని తెలిపారు. అప్పట్లో దీనిపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేశామన్నారు. యూనివర్సిటీలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యం ఫీజులు పెంచి వసూలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజులు కడితేనే పరీక్షలకు అనుమతిస్తామంటూ నిత్యం వేధింపులకు గురి చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం ఈ యూనివర్సిటీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

ప్రజాశక్తి - అమరాపురం

మండల పరిధిలోని హేమావతి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరు యువకుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఈరన్న డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మృతుల కుటుంబాలకు తన సానుభూతిని వ్యక్తం చేశారు.

స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాల ప్రదర్శన

ప్రజాశక్తి కదిరి టౌన్

మున్సిపల్ ఉర్దూ స్కూల్‌లో స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాల ప్రదర్శన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సిద్దారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపల్ ఉర్దూ పాఠశాలలో జమాతే ఇస్లామీ హింద్ ఇటికల ఇలియాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాల ప్రదర్శన కార్యక్రమం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రదర్శనను అందరూ సందర్శించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ నిర్వాహకులు, నాయకులు పాల్గొన్నారు.



స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

శాంతియుతంగా ఎన్నికలను నిర్వహిద్దాం

◆అన్ని పార్టీలూ సహకరించాలి ◆కలెక్టర్ బసంత్ కుమార్



వివిధ రాజకీయ పార్టీల నాయకులలో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

మండలి ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలూ సహకరించాలని కలెక్టర్ బసంత్ కుమార్ కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన నేపథ్యంలో కలెక్టరేట్లోని స్పందన మినీహాల్లో జిల్లాలోని రాజకీయ పార్టీల నాయకులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 9న ఎన్నికల షెడ్యూల్ విడుదల అయ్యిందన్నారు. ప్రస్తుతం ఎన్నికల నియమ నిబంధనలు అమల్లోకి వచ్చాయన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా, పారదర్శకంగా జరగడానికి అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఎన్నికల షెడ్యూల్ మేరకు ఈనెల 16న నోటిఫికేషన్ జారీ అయినప్పటి నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ, 24న పరిశీలన, 27న నామినేషన్ల ఉపసంహరణ మార్చి 13న ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. మార్చి 16న ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. ఈ ఎన్నికలు మార్చి 21 లోగా పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 13 నుంచి ఓటరు నమోదు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అనంతరం వాటిని పరిశీలించి ఓటింగ్ నాటికి తుది జాబితాలో పేర్లు నమోదు చేస్తామన్నారు. ఆన్లైన్ ద్వారా మాత్రమే ఓటర్ నమోదు చేయించుకోవాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి ఎన్నికలు నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కొండయ్య, వైఎస్సార్ ప్రతినిధి ఆవుటాల రమణారెడ్డి, టిడిపి నుంచి సామకోటి ఆదినారాయణ, సిపిఎం నాయకులు ఈఎస్.వెంకటేశు, పైపల్లె గంగాద్రి, బిజెపి నుంచి జ్యోతిప్రసాద్ పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు, సాగురైతులు

సాగు రైతులకు పట్టాలివ్వాలి : వ్యకాసం

ప్రజాశక్తి - చిలమత్తూరు

సాగులో ఉన్న రైతులకు పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని దేమకేతేపల్లి పంచాయతీ ఓబులాపురం గ్రామం లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దేమకేతేపల్లి పొలం సర్వేనెంబర్ 377,67 లలో జెండా ఆవిష్కరణను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దశాబ్ధాలుగా సాగులో ఉన్న రైతులకు హక్కు కలిస్తూ పట్టాలని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, లక్ష్మి నారాయణ, మాబు, నంజుండ, శ్రీనివాసులు, నిడిమామిడప్ప తదితరులు పాల్గొన్నారు.

ఫేస్‌యాప్‌ను రద్దు చేయాలి : సిఐటియు



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగంలోనికాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఫేస్‌యాప్ హాజరు విధానాన్ని రద్దు చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. ఈ యాప్‌ను రద్దు చేసే వరకు కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. శనివారం పట్టణంలోని కల్లూరు సుబ్బారావు ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆందోళనకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల్లో అధిక శాతం మంది నిరక్షరాస్యులు ఉన్నారన్నారు. వీరందరికీ స్మార్ట్ ఫోన్లు లేవన్నారు. అయితే ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానాన్ని అనుసరించి కార్మికుల హాజరు విధానం ఎండి ఎఫ్ఆర్ఎస్ స్థానంలో ఎపిఎఫ్ఆర్ఎస్‌ను గత నెల 16వ తేదీ నుంచి ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఈ కొత్త హాజరు విధానం ద్వారా ఎవరి సెల్ ఫోను లో వారే స్వయంగా ప్రభుత్వం నిర్ణయించిన ప్రదేశంలో నిలబడి ఫోటో తీసి ప్రభుత్వం తయారు చేసిన యాప్ ద్వారా హాజరు పంపించాలని నిబంధనలు పెట్టడం అన్యాయమన్నారు. మున్సిపల్ కార్మికుల్లో అత్యధిక మంది నిరక్ష్యరాస్యులు ఉన్నారన్నారు. అందులోను అత్యధిక మందికి సొంత స్మార్ట్ ఫోన్లు లేవన్నారు. ఇప్పటికే ఇంజనీరింగ్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నారని వీరి సమస్యలు వర్ణాతీతంగా మారాయని అన్నారు. సెల్ ఫోన్ లో నెట్ లేక పోవడం, నెట్ వర్క్ ఉంటే సర్వర్ లేకపోవడం లాంటి సమస్యల వల్ల కార్మికులు గంటల తరబడి మున్సిపల్ కార్యాలయం ముందు సెల్ ఫోన్లు చేతుల్లో పట్టుకొని పేస్ యాప్‌నమోదు చేయడానికి నానా తంటాలు పడుతున్నారని అన్నారు. దీంతో కార్మికులు హాజరు అయినప్పటికీ, ముఖ ఆధారిత హాజరులో హాజరు కాలేదని పడుతోందన్నారు. హాజరుకాని రోజుల వేతనాలను ఇవ్వకుండా రద్దు చేయడంతో పాటు కార్మికులపై క్రమశిక్షణ చర్యలు తీసుకొనే అధికారం ప్రభుత్వానికి ఉంటుందన్నారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా కార్మికులను విధుల్లో నుంచి తొలగించే అవకాశాలు సైతం ఎక్కువగా ఉన్నాయన్నారు. కార్మికులకు శాపంగా ఉన్న ఈ యాప్ ను వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనికోసం ఈనెల 16వ తేదీన హిందూపురం పురపాలక సంఘ కార్యాలయం ముందు ఆందోళన చేపడుతున్నామన్నారు. ఈ ఆందోళన కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి జగదీష్, మున్సిపల్ వర్కర్స్ అధ్యక్షులు మల్లికార్జున, కోశాధికారి ఆనంద, నాయకులు మంజు, నాగేంద్ర, చంద్ర, నరసింహామూర్తి, రామాంజనేయులు, ఓబులమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఆహార పంటల్లో జన్యుమార్పిడితో ముప్పు

ప్రజాశక్తి కదిరి టౌన్

ఆహార పంటలలో జన్యు మార్పిడి వలన తీవ్ర ముప్పు వాటిల్లుతుందని సంస్థ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ సురక్షిత ఆహార వారోత్సవాలలో భాగంగా ఆహార పంటలలో జన్యు మార్పిడివల్ల కలిగే ముప్పు అనే అంశంపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కన్వినర్ భానుజా మాట్లాడుతూ ఇటీవల జన్యు మార్పిడి ఆవాల పంటకి కేంద్రప్రభుత్యం అనుమతి ఇవ్వడంతో ఆహార పంటలలో జన్యు మార్పిడి ప్రమాదంగా మారనుందన్నారు. జన్యుమార్పిడి పంటల విషయంపై దేశ మంతటా అన్ని వర్గాల ప్రజలు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారన్నారు. జన్యు మార్పిడి పంటల వలన ఆరోగ్యం పర్యావరణం పై పడే ప్రభావాలతో పాటు రైతులు విత్తనాల హక్కులను కోల్పోతారన్నారు. రైతులు, మేధావులు, ప్రజా సంఘాల నాయకులు జన్యుమార్పిడి పంటలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో రైతులు రైతు ఉత్పత్తి దారుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భానూజ

ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్‌ఒ కృష్ణారెడ్డి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ప్రభుత్వాస్పత్రులలోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిఎం హెచ్ఒ కృష్ణారెడ్డి సూచించారు. స్థానిక ఎన్జీవో కార్యాలయంలో ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలోని మెడికల్ ఆఫీసర్లు, ఎఎన్ఎంలు, సూపర్వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలన్నారు. హై రిస్క్ గర్భిణుల కేసులను జిల్లా ప్రభుత్వాస్పత్రులకు రెఫర్ చేయాలన్నారు. రోగ నిర్ధారణ బట్టి వైద్యచికిత్సలు అందించాలన్నారు.కాలాగుణంగా వచ్చే వ్యాధులపై ముందుగానే ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రణాళికలను ఏర్పాటుచేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సెల్విసాల్మాన్, ప్రభుత్వ వైద్యాధికారులు పాల్గొన్నారు.

ముమ్మరంగా రైల్వే రోడ్డు ఆక్రమణల తొలగింపు పనులు



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో రైల్వే రోడ్డు ఆక్రమణల తొలగింపు పనులు ఊపందుకున్నాయి. 2019 ఎన్నికల సమయంలో అధికార పార్టీ తరపున పోటీ చేసిన ఇక్బాల్ ఇచ్చిన హామీని నెరవేర్చుతున్నారు. పురపాలక సంఘ ఎన్నికల్లో తమకు అవకాశం కల్పిస్తే రైల్వే రోడ్డు విస్తరణ పనులు చేపడతామని పురపాలక ఎన్నికల్లో హామీ కూడా ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నారు. ఇచ్చిన హామీ మేరకు పురపాలక సంఘంలో చైర్‌పర్సన్ ప్రమాణస్వీకారం చేసిన ఇంద్రజ రైల్వే రోడ్డు విస్తరణ పనుల కోసం తొలి సంతకం చేశారు. పాలకవర్గం తొలి నిర్ణయానికి మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు సహకారం అందిస్తున్నారు. దీంత దశాబ్దాలుగా పెండింగ్ లో వున్న రైల్వే రోడ్డు విస్తరణ పనులు చకచకా జరుగుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీఆర్ సర్కిల్ నుండి నంది సర్కిల్ వరకు ఒక కిలోమీటర్ మేర వున్న 35 అడుగుల రోడ్డును మాస్టర్ ప్లాన్ లో భాగంగా 80 అడుగులకు విస్తరించాలని గతంలో నిర్ణయించారు. అయితే స్థానికుల విజ్ఞప్తుల మేర దానిని 70 అడుగులకు తగ్గించగా, దీనికి అహుడా ఆమోదం కూడా లభించింది. ఏడాది క్రితం పనులు ప్రారంభమై చురుగ్గా సాగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా 163 దుకాణాలు, ఇళ్లు వున్నట్లు ప్రైవేటు ఏజెన్సీ సర్వే నివేదిక ఇచ్చింది. సంబధిత యజమానులతో పలు దఫాలుగా కమిషనర్ చర్చలు జరిపి వారిని ఒప్పించగలిగారు. ఇప్పటి వరకు 80 శాతం మంది తమ అంగీకార పత్రాలను అధికారులకు అందచేశారు. కట్టడాల తొలగింపు కోసం 117 మందికి పరిహారాన్ని మున్సిపాలిటీ అందచేసింది. కాగా కోల్పోయిన స్థలాన్ని గుర్తించి దాని మార్కెట్ విలువ కంటే నాలుగు రెట్లు అధికంగా ఇస్తూ టిడిఆర్ బాండ్లను జారీ చేశారు. 36 మంది విస్తరణ పనులను వ్యతిరేకిస్తూ తాము నష్ట పోతామని కోర్టును ఆశ్రయించారు. అయితే అన్నివిధాల పరిశీలన చేసిన న్యాయస్థానం డ్యూ ప్రాసెస్ కింద చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ నిర్మాణాలను కూడా అవసరమైన మేర తొలగించి వారికి పరిహారం అందచేస్తామని కమిషనర్ వివరించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.84.5 లక్షలు విడుదల అయింది. ఈ నిధులతో తొలుత మురుగుకాలువ పనులు ప్రారంభించడానికి అధికారులు టెండర్ నిర్వహించగా, ఈ పనుల కోసం ముగ్గురు కాంట్రాక్టర్లు టెండర్లు పొందారు. గత నెలలో డ్రైనేజీ నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి.

పట్టణ అభివృద్ధికి సహకరించాలి : ఎమ్మెల్సీ

పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్సీ ఇక్బాల్ కోరారు. గత పాలకులు అభివృద్ధిని విస్మరించి, కేవలం రాజకీయ కోణంగానే చూశారని విమర్శించారు. దీంతో హిందూపురం పట్టణం అభివృద్ధి చెందలేదని వ్యాఖ్యానించారు. అయితే జగనన్న ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలు పక్కన పెట్టి అభివృద్ధి, సంక్షేమం అన్న నినాదంతో ముందుకెళుతోందన్నారు. రెండు దశాబ్దాలుగా పుర ప్రజలకు కలగా మిగిలిన రైల్వే రోడ్డు విస్తరణ పనులు చేపడుతామని ఎన్నికల సమయంలో ఇచ్చిన మేరకు ఇప్పటికే రైల్వే రోడ్డు విస్తరణ పనులు చేపట్టామన్నారు.

అందరి సహకారంతోనే... : కమిషనర్

ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్, మున్సిపల్ కౌన్సిల్ సహకారంతో రైల్వే రోడ్డు విస్తరణ పనులు సకాలంలో పూర్తి చేస్తామని కమిషనర్ ధీమా వ్యక్తం చేశారు. భవనాలు కోల్పోయే వారిలో అభ్యంతరం చెప్పిన వారు కూడా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంగీకరించని వారి స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు రెవిన్యూ చట్టం ప్రకారం ల్యాండ్ అక్విజేషన్ కు వెళతామన్నారు. అప్పుడు మిగిలిన వారికి వచ్చినట్లు టిడిఆర్ మొత్తం వీరికి ఇవ్వడం జరగదన్నారు. విశాలమైన రోడ్డు, ఫుట్‌పాత్, పార్కింగ్ సౌకర్యం, సెంట్రల్ లైటింగ్, తదితర పట్టణ సుందరీకరణకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

చంద్రాయుని స్వామి ఉత్సవాలు

బుక్కపట్నం : మండల పరిధిలోని చంద్రాయునిపల్లిలో ఉన్న చంద్రాయుని స్వామి తడక మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మాఘమాసం రెండవ శనివారం తడక మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా తంగేమ్ వంశస్థుల ఆధ్వర్యంలో ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. ఉత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

16న శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి కదిరి టౌన్

హిందూపురం పట్టణంలో ఈ నెల 16న జరిగే శ్రీకృష్ణ దేవరాయల కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి బలిజ సోదరులు పెద్ద ఎత్తున తరలిరావాలని హిందూపురం బలిజ సంఘం నాయకులు ఆకుల ఉమేష్ కోరారు. ఈ మేరకు ఆయన శనివారం కదిరి పట్టణంలో బలిజ సంఘం నాయకులతో కలిసి ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి రమణ, సోము శేఖర్, పిడుగు శ్రీనివాసులు, రవి, ఆకుల రవీంద్ర, శివశంకర్, రాజేంద్రప్రసాద్, కటారు హరి, కాటే పల్లి సాయి ప్రతాప్, ట్రావెల్స్ రవి, భైరవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాదుస్తులు అందజేత

లేపాక్షి : మండల పరిధిలోని పులమితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచారు. వీరికి సిఐ ఇస్మాయిల్ చేతుల మీదుగా క్రీడా దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మునీర్, ఫుట్‌బాల్ సీనియర్ క్రీడాకారుడు శేఖర్, స్థానిక సర్పంచి అశ్వర్థనారాయణప్ప, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మంజునాథ్ , హెచ్ఎం కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణమండపం ప్రారంభం

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలం, వీరేపల్లిపేటలో వీరాంజనేయ స్వామి దేవస్థానం ఆవరణంలో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపాన్ని ఎమ్మెల్యే సిద్దారెడ్డి, సిఇసి సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

లేపాక్షి: మండలం పరిధిలోని లక్కేపల్లి చెరువులో అమృత్ సరోవర్ పథకంలో భాగంగా చేస్తున్న పనులను పీడీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన పనులను పూర్తి చేయాన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిడి శివానంద్, ఎపిఒ జ్యోతి, రషీద్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ, తదితరులు

పారిశుధ్య కార్మికుల సమస్యలు పట్టని ప్రభుత్వం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి -పెనుకొండ

పారిశుధ్య కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి పట్టడం లేదని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ విమర్శించారు. శనివారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో నగర పంచాయతీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ఆర్ ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పట్టించుకునే పరిస్థితిలో లేదని విమర్శించారు. తాను పట్టిన కుందేలకు మూడే కాళ్లు అన్న చందంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం బాధాకరమన్నారు. పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి ప్రణాళిక రూపొందించామన్నారు. ఫిబ్రవరి 10 నుండి 15వ తేదీ వరకు స్థానికంగా నగరపంచాయతీ పాలకవర్గాలు ,అధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రులు, జిల్లా కలెక్టర్లతో సామూహిక రాయబారాలు నిర్వహిస్తామన్నారు. 16న నగర పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామన్నారు. అప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే చలో అసెంబ్లీ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, నాయకులు వజ్రం నాగప్ప, నగర కార్మికుల యూనియన్ నాయకులు చిన్న వెంకటేష్ , వెంకటేష్, తిప్పన్న, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారంలో రాజీమార్గమే ఉత్తమం



ధర్మవరంలో నిర్వహిస్తున్న లోక్ అదాలత్

హిందూపురం : రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలని స్థానిక జిల్లా జడ్జి శైలజ సూచించారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చిన్నపాటి వివాదాలకు పోలీస్ స్టేషన్ ల చుట్టూ తిరిగి వ్యయప్రయాసాలకు గురి కాకుండా రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలన్నారు. అందుకోసమే లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నామన్నారు. కాగా హిందూపురం రూరల్ మండల పరిధిలోని వీరంపల్లిలో గత కొంతకాలంగా వివాదాస్పదంగా మారిన రహదారి సమస్యను పరిష్కరించారు. దీంతో గ్రామస్తులు న్యాయమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా మెగా లోక్ అదాలత్ లో మూడు బెంచ్ లను ఏర్పాటు చేసి 184 కేసులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు స్పందన, రాజ్యలక్ష్మి, ఎపిపి నగేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగప్ప, కార్యదర్శి సుదర్శన్, లోక్ అదాలత్ సభ్యులు సిద్ధూ, కళావతి, కృష్ణమూర్తి, పార్వతి, ఫణి భూషణ్, చెన్నప్ప, లోక్ అదాలత్ శారద, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : రాజీ మార్గంతో ప్రశాంత జీవనం సాగించాలని సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి తెలిపారు. స్థానిక కోర్టులో శనివారం లోక్‌అదాలత్‌ను నిర్వహించారు.ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి మాట్లాడుతూ గ్రామాల్లో అనేక మంది క్షణి కావేశానికి లోనై కేసుల్లో ఇరుక్కుని కోర్టుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గ్రామాలలో అందరూ ప్రశాంత వాతావరణంలో జీవించాలన్నారు. కేసుల్లో ఇరుక్కుని జైలుపాలైతే కుటుంబ సభ్యుల పరిస్థితులు ఎలా ఉంటాయో ఒక్కసారి ఆలోచించాలన్నారు. అనంతరం పలుకేసులను రాజీ ద్వారా పరిష్కరించారు. మొత్తం 330 కేసులను పరిష్కరించినట్లు జడ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోషియేషన్ సీనియర్ న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : రాజీ మార్గంతోనే కేసులు పరిష్కరించుకోవాలని సీనియర్ న్యాయమూర్తి, లోక్ అదాలత్ చైర్మన్ వెంకటేశ్వరరావు సూచించారు. శనివారం స్థానిక న్యాయస్థానం ఆవరణంలో లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ చిన్నచిన్న సమస్యలతో కేసుల్లో ఇరుక్కుని ప్రశాంతత వాతావరణాన్ని కోల్పోతున్నారని అన్నారు. ఇలాంటి వారందరూ లోక్‌అదాలత్‌లో తమ సమస్యలను రాజీమార్గంతో పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ న్యాయమూర్తి ప్రతిమ, అడిషనల్ సివిల్ జడ్జ్ మీనాక్షి సుందరి, ద్వితీయ శ్రేణి మెజిస్ట్రేట్ షఫీవుల్లా, న్యాయవాదులు లింగాలలోకేశ్వర్ రెడ్డి ,నరసింహులు, సిఐ తమ్మిశెట్టి మధు, నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని దుర్గానగర్‌లోని శ్రీతలా దేవి సమేత రామలింగేశ్వరస్వామి విగ్రహప్రతిష్ట మహోత్సవాలలో భాగంగా నాల్గవరోజు శనివారం మూలవిరాట్లను గ్రామంలో ఊరేగించారు. ఆదివారం ఈ విగ్రహప్రతిష్ట మహోత్సవాలు ముగుస్తాయని ఆలయ అభివృద్ధి కమిటీసభ్యులు చిన్నిక్రిష్ణ, రామకృష్ణ, రామాంజినేయులు, లక్ష్మీ నారాయణ, రాము, పోతలయ్య తెలిపారు.



మూలవిరాట్‌ల ఊరేగింపు

మామిడి, జామచెట్లకు నిప్పు

ధర్మవరం టౌన్ : మామిడి, జామ, నిమ్మకాయ, అల్లనేరడి చెట్లకు శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పుపెట్టిన సంఘటన మండలంలోని రేగాటిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. తనకున్న ఐదెకరాలలో 2017లో వంద మామిడి చెట్లు, 350 జామ చెట్లు, 20 నిమ్మచెట్లు, 20 అళ్లనేరడి చెట్లు సాగు చేసినట్లు రేగాటిపల్లి గ్రామానికి చెందిన దళిత రైతు వరదరాజులు తెలిపారు. కంటికి రెప్పలా కాపాడుకున్న పంటను గుర్తుతెలియని దుండగులు శుక్రవారం నిప్పుపెట్టడంతో చెట్లన్నీ కాలిపోయాయని రైతు వాపోయారు. సమీప పొలంవారు సమాచారం ఇవ్వడంతో వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా మంటలను ఆర్పివేశారన్నారు. దీంతో తనకు రూ.5లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు ధర్మవరంరూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోతయంత్రం తగిలి వ్యక్తి మృతి

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని రాతిబావి వంక గ్రామానికి చెందిన వన్నప్పశెట్టి (70) కందుల కోత యంత్రం తగిలి మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. వన్నప్ప తన వ్యవసాయ పొలంలో శనివారం కందులు యంత్రంతో పంటను కోశారు. ఇందులో భాగంగా యంత్రం వెనకవైపు కందులు పడుతున్నాయని గమనించిన వన్నప్ప చెయ్యి అడ్డుగా పెడుతుండగా యంత్రం లాక్కుంది. దీంతో తీవ్రంగా గాయపడిన బాధితుడిని కుటుంబ సభ్యులు చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బ్రాహ్మణపల్లిలో బాలికపై అత్యాచారయత్నం

బెలుగుప్ప : మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో మూడవ తరగతి చదువుతున్న చిన్నారిపై డిగ్రీ చదువుతున్న ఓ యువకుడు శుక్రవారం అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. పాఠశాల సమయంలో ముగ్గురు చిన్నారులకు చాక్లెట్లు ఇప్పిస్తానని నమ్మబలికి ఇంట్లోకి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఇద్దరు చిన్నారులు బయట ఉండగా మూడో తరగతి చదువుతున్న చిన్నారిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. అయితే బాలిక గట్టిగా అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చారు. గమణించిన యువకుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాలికకు రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం కళ్యాణదుర్గం తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడిన యువకుడిని కఠినంగా శిక్షించాలని బ్రాహ్మణపల్లి గ్రామస్తులు డిమాండ్‌చేశారు. యువకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. కాగా తల్లిదండ్రులు చిన్నారిని అమ్మమ్మ వద్ద వదిలి ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు.

అరటి, సీతాఫలం తోట దగ్ధం

రూ.10 లక్షల ఆస్తి నష్టం

పుట్లూరు : ప్రమాదవశాత్తు అరటి, సీతాఫలం తోటలు దగ్ధమైన ఘటన శనివారం మండల పరిధిలోని సి.వెంకన్నపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వెంగలపల్లి గ్రామానికి చెందిన రామ్మోహన్‌రెడ్డి తనకున్న పదెకరాల పొలంలో అరటి, సీతాఫలంతో పాటు టెంకాయ చెట్లు సాగు చేశాడు. ఈనేపథ్యంలో శనివారం ప్రమాదవశాత్తు చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో అరటి, సీతాఫలం పంటలు పూర్తిగా కాలిపోయినట్లు బాధిత రైతు వాపోయాడు. అంతేగాకుండా డ్రిప్పు, కేబుల్ వైర్లు స్టార్టర్ కాలిపోయినట్లు ఆందోళన వ్యక్తం చేశాడు,. ఈ ఘటనలో సుమారు రూ.10లక్షలు ఆస్తినష్టం వాటిళ్లినట్లు వాపోయాడు. ప్రభుత్వం స్పందించి ఆర్థికసాయం అందించాలని రైతు కోరాడు.

అంత్యక్రియలకు 'ఆత్మ బంధువులు'

పుట్టపర్తి అర్బన్ : అనాధల అంత్యక్రియలకు ఆత్మ బంధువులుగా వారి వారి సాంప్రదాయ పద్ధతులతో ఇద్మత్ ఏ ఖల్క్ ట్రస్ట్ సభ్యులు సేవలు అందించడం అభినందనీయమని పలువురు ప్రశంసించారు. శనివారం ఉదయం పట్టణంలోని స్టేట్ బ్యాంక్ వీధిలో తమిళనాడుకు చెందిన బాలన్ (87) అనారోగ్యంతో మృతి చెందాడు. బాలన్ చాలా ఏళ్లుగా సత్యసాయి భక్తుడుగా ఇక్కడే నివసిస్తున్నాడు. అతడు ఎవరూ లేని అనాధ. అతని అంత్యక్రియలకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ట్రస్ట్ సభ్యులు ముందుకు వచ్చి అమృత వాటర్ మారుతి సమకూర్చిన వైకుంఠ రథంలో మృతదేహాన్ని తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శామీర్, అలీ, చాంద్ బాషా, షాకీర్, నయాజ్ పాల్గొన్నారు.



అనాథమృతదేహానికి అంత్యక్రియలు చేస్తున్న ట్రస్టు సభ్యులు

కరువు నేలలో కార్పొరేట్లకు కాసుల పంట

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



దేశంలోనే అత్యల్ప వర్షపాతం కలిగిన ప్రాంతంగా అనంతపురం ఉంది. జైసల్మీర్ తరువాత అతి తక్కువ వర్షపాతం కలిగి, నిత్యం క్షామపీడిత ప్రాంతంగా ఉండటంతో ఇక్కడి రైతులు వర్షాల కోసం ఎప్పుడూ ఆకాశం వైపు ఎదురు చూస్తూ ఉంటారు. ఎప్పుడూ ఎండలు ఉండి, మబ్బులే కనిపించక రైతులు అష్టకష్టాలు పడుతుంటారు. ఇప్పుడూ ఇదే కార్పొరేట్లకు కాసులు కురిపించనున్నాయి. మారిన పరిస్థితుల నేపథ్యంలో గ్రీన్ ఎనర్జీ అంటే ప్రకృతి వనరుల ఆధారంగా విద్యుత్ ఉత్పత్తి చేపట్టే ఆలోచన అంతర్జాతీయంగా పెరుగుతోంది. ఇందుకు కోసం పెద్దపెద్ద కంపెనీలకు ఆయా ప్రభుత్వాలు పెద్దఎత్తున ప్రోత్సహకాలు అందజేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కార్పొరేట్లు ఇప్పుడు విద్యుత్ ఉత్పత్తి రంగంలోకి పెద్దఎత్తున ప్రవేశిస్తున్నాయి. సువిశాల భూభాగం కలిగిన కావాల్సినంత ఎండ, గాలి ఉండటంతో పవన విద్యుత్ ఉత్పత్తికి ఉమ్మడి అనంతపురం జిల్లా అత్యంత అనువైన ప్రాంతంగా ఉంది.ఇప్పటికే 4811 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు జరిగింది. మరిన్ని కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు నడుస్తోంది. ఈ మేరకు జిల్లాలో పెద్దఎత్తున భూములను ఆ సంస్థలకు కట్టబెట్టే ఆలోచనను ప్రభుత్వం చేస్తోంది. ఇది వరకే రాయదుర్గం నియోజకవర్గం పరిధిలో 11 వేల ఎకరాలకు వరకు మొదటి విడతలో ఇవ్వడానికి రంగం సిద్ధమైంది. ఇది వరకు గ్రామ సభలు సైతం నిర్వహించారు. ఇది చాలదన్నట్టు తాజాగా ఈ వారంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో అదే సంస్థకు మరో 406 ఎకరాల భూమిని పంప్‌డ్ పవర్ ఉత్పత్తి పేరుతో కేటాయించారు. ఇంకా వేలాది ఎకరాలకు ఇవ్వడానికి అనువుగా నున్నట్లు ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు చెబుతోంది. ఈ రకంగా జిల్లాలో లక్షల ఎకరాల భూములను కంపెనీలకివ్వడానికి సుముఖత వ్యక్తం చేసింది. విద్యుత్ డిమాండ్ కూడా ఉండటంతో కంపెనీలు ముందుకొస్తున్నాయి. అయితే వీటిని ఏర్పాటు చేసి కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నాయి. అయితే తీసుకున్న భూములకు ఎటువంటి పరిహారం చెల్లించని సంస్థలు, రైతులకు లీజు పేరుతో ఏడాదికి రూ.30 వేలు ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ అంశాన్ని ఇప్పుడు సిపిఎం లేవనెత్తింది. రైతులకు ఏడాదికి కాకుండా నెలకు రూ.30 వేలు ఎకరానికి లీజు ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. ఈ అంశంపైనే గత వారంలో ఎన్జీవో హోంలో జరిగిన సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ కూడా దీనిపై పోరాటం చేస్తామని చెబుతోంది. రైతుల్లో అవగాహన కల్పించి సమీకరించి పోరాటం సాగిస్తామంటోంది. ఇదే సమయంలో కేంద్రప్రభుత్వం తొలి వారంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పైనా విపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అప్పర్ భద్రకు కేంద్రం నిధులు కేటాయించడంపై జిల్లాలో నేతలు మండిపడుతున్నారు. అన్ని రాజకీయ పక్షాలు దీనిపై స్పందించాయి. అడ్డుకుంటామని చెబుతున్నాయి. అయితే ఇంత వరకు ఏ సంఘం కూడా దీనిపై కార్యచరణ ఏదీ ప్రకటించలేదు. అప్పర్ భద్ర నిర్మాణం పూర్తయితే అనంతపురం జిల్లాకు తీరని నష్టం జరుగుతుందన్న ఆందోళన మాత్రం వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు అంశాలు జిల్లాలో గత వారం ప్రధాన హాట్ టాపిక్‌గా మారాయి. అటు రాజకీయంగానూ ఇవి చర్చనీయాంశమూ అయ్యాయి.

నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

హిందూపురం : భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పై మూడు రోజుల క్రితం అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రసాద్ పై దేశద్రోహంతో పాటు ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ప్రసాద్‌పై కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కెపిఎస్ మండల కార్యదర్శి మధు, కాటికాపర్ల సంఘం మండల అధ్యక్షులు గోపాలప్ప, నారాయణప్ప, శ్రీనివాసులు, హరి, కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.